క్లుప్తంగా

నేడు ఆళ్లమూడిలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

భట్టిప్రోలు: మండలంలోని కోనేటిపురం సచివాలయం పరిధిలోని ఆళ్లమూడిలో సోమవారం సాయంత్రం 4 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున గడప గడపకు తిరిగి, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలును తెలుసుకుంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ, జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజా ప్రతినిధులు పాల్గొనాలని తెలిపారు.

డాక్టర్ సిద్ధార్థ సేవలు ఎనలేనివి



పిట్టలవానిపాలెం: డాక్టర్ సిద్దార్థ సేవలు మరువలేనివని చలన చిత్ర నటుడు సుమన్ అన్నారు. ఖాజీపాలెం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాలలో వైద్యునిగా విధులు నిర్వహించిన డాక్టర్ సిద్దార్థ సేవలను గుర్తిస్తూ లయన్స్ క్లబ్ హైదరాబాద్ వారు ఆయనకు పురస్కారాన్ని అందజేశారు. సుమన్ మాట్లాడుతూ డాక్టర్ సిద్దార్థ తెలంగాణలో ఉచిత వైద్య శిబిరాలు, భావురి పట్టణంలో కరోనా క్వారంటైన్‌లో సేవలు అందించినట్లు తెలిపారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



బాపట్ల: లయన్స్ క్లబ్ ఆఫ్ బాపట్ల, ఏషియన్ హాస్పిటల్ ఆధ్వర్యంలో స్థానిక సాధన స్కూల్ క్యాంపస్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వంద మందికి ఉచిత పరీక్షలు నిర్వహించి, మందులు అందించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు ఫణిరాజశయన్, కార్యదర్శి ఉషారాణి, కోశాధికారి శివరామకృష్ణ, రీజియన్ చైర్మన్ గోపాళం రఘుపతిరావు, అలపర్తి శ్రీనివాసరావు, వంకాయలపాటి హరిబాబు, యజ్ఞ నారాయణ, గుండ్రెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఆధునీకరణ పనులకు శంకుస్థాపన

నగరం: మండలంలోని చినమట్లపూడి గ్రామంలో కోటి రూపాయల వ్యయంతో చేపట్టనున్న విద్యుత్ ఆధునీకరణ పనులకు రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు సోమవారం శంకుస్థాపన చేయనున్నట్లు ఎంపీపీ చింతల శ్రీకృష్ణయ్య చెప్పారు. ఆదివారం ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. చినమట్లపూడి గ్రామంలోని విద్యుత్ సమస్యలను పరిష్కరించేవిధంగా విద్యుత్ లైన్‌ల ఆధునీకరణ చేపట్టనున్నట్లు చెప్పారు. ఎంపీ మోపిదేవి ఈ పనులకు శంకుస్థాపన చేయనున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరు కావాలని కోరారు.

నేడు లూథరన్ సంఘం ఆవిర్భావ దినోత్సవం

భట్టిప్రోలు: ఆంధ్ర సౌవార్తిక లూథరన్ సంఘం 182వ ఆవిర్భావ దినోత్సవం (గాస్పెల్ డే) సోమవారం భట్టిప్రోలు క్రీస్తు లూథరన్ దేవాలయంలో ఘనంగా నిర్వహించనున్నట్లు సంఘ కాపరి రెవరెండ్ దాసరి రవీంద్రవర్మ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆంధ్ర సౌవార్తిక లూథరన్ సంఘం వ్యవస్థాపకుడు రెవరెండ్ డాక్టర్ జాన్ క్రిష్టియన్ ఫ్రెడ్రిక్ హయ్యర్‌కు నివాళులర్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు, స్త్రీల సమాజం, యూత్, చిల్డ్రన్స్, సంఘస్థులు పాల్గొనాలని ఆయన కోరారు.

కదిలే రైలు నుంచి దిగుతూ..

రేపల్లె: కదిలే రైలు నుంచి దిగుతున్న క్రమంలో విశ్రాంత ఆర్మీ ఉద్యోగికి తీవ్ర గాయాలైన ఘటన ఆదివారం సాయంత్రం రేపల్లెలో చోటుచేసుకుంది. జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ వేణు వివరాల మేరకు.. మండలంలోని మోర్లావారిపాలేనికి చెందిన విశ్రాంత ఆర్మీ ఉద్యోగి జముడుగాని నాగరాజు.. తెనాలి నుంచి రేపల్లెకు రైలులో వస్తున్నాడు. మోర్లవారిపాలెం గేటు వద్ద రైలు నెమ్మదించి ఆయన దిగే క్రమంలో ప్రమాదవశాత్తు రైలు కింద పడ్డాడు. ఈ ఘటనలో నాగరాజు కాలు పూర్తిగా తెగిపోయింది. తీవ్రంగా గాయపడిన అతనిని స్థానికులు, కుటుంబ సభ్యులు అంబులెన్స్ సాయంతో గుంటూరుకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని హెడ్ కానిస్టేబుల్ వేణు తెలిపారు.



సార్వత్రిక విద్యకు మంచి అవకాశం..

- టెన్త్, ఇంటర్మీడియట్ పరీక్షలకు దరఖాస్తులు స్వీకరణ
- ఇంటి దగ్గర నుంచే చదువుకునే విద్యార్థులకు వెసులుబాటు
- సాధారణ కోర్సులతో సమానమైన గుర్తింపు



సార్వత్రిక విద్యాలయంలో చదువుకుంటున్న విద్యార్థులు

బాపట్ల అర్బన్: ఉన్నత విద్య కోసం ఆశపడి, అనుకోని అవాంతరాలు, ఆర్థిక ఇబ్బందులతో చదువుకు ఫుల్‌స్టాప్ పెట్టేసిన వారు అనేకమంది. వివాహం అనంతరం వయస్సు వచ్చేసిన తర్వాత చదువుకోలేకపోయామే అని దిగులు పడేవారు మరికొందరు. అటువంటి వారి చింత తీర్చేందుకు సార్వత్రిక విద్య (ఓపెన్ స్కూల్) విధానం అందుబాటులో ఉంది. పాఠశాలలో చదువుకునే అవకాశం లేని బాలబాలికలకు, వయోజనులకు విద్య అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం 1991లో ఏపీ ఓపెన్ స్కూల్ విధానాన్ని ప్రవేశపెట్టడం జరిగింది. రోజు వారి కార్యకలాపాలకు ఆటంకం లేకుండా సార్వత్రిక పాఠశాల ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియట్ చదివే అవకాశాన్ని ఏపీ సార్వత్రిక విద్యాపీఠం కల్పిస్తోంది. సార్వత్రిక పాఠశాలల్లో చదివి ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఇచ్చే సర్టిఫికెట్లకు ప్రభుత్వ గుర్తింపు ఉంటుంది. దీంతో ఉన్నత చదువులకు, ఉద్యోగాలు పొందేందుకు అర్హత ఉంటుంది. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన వారు ఎంసెట్, డైట్ సెట్ వంటి పరీక్షలతో పాటు ఇంటర్మీడియట్ అర్హతతో లభించే ఉద్యోగాలు పొందగలరు.

ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ

జిల్లా విద్యాశాఖ అధికారి పర్యవేక్షణలో నిర్వహించే సార్వత్రిక విద్యాపీఠం ప్రవేశాలకు నోటిఫికేషన్ వెలువడింది. దరఖాస్తులను బుధవారం నుంచి స్వీకరిస్తున్నారు. బాపట్ల జిల్లాలో 38 అక్రిడేటెడ్ విద్యా సంస్థలు ఉన్నాయి. ఇందులో ప్రవేశాలకు అధ్యయన కేంద్రాల్లో కో–ఆర్డినేటర్ వద్ద ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలి. ఏపీ ఆన్‌లైన్ సెంటర్లో ఫీజు చెల్లించాలి. ఎటువంటి అపరాధం రుసుం లేకుండా సెప్టెంబర్ 25 తేదీలోగా ఆన్‌లైన్ అడ్మిషన్ పొందవచ్చు. రూ.200 అపరాధ రుసుంతో సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ 5వ తేదీ వరకు అడ్మిషన్ పొందవచ్చు. ఒప్పంద తరగతులు ఓపెన్ స్కూల్లో అడ్మిషన్ పొందిన వారికి ఆదివారం, ప్రతి నెల రెండో శనివారం అధ్యయన కేంద్రాల్లో 30 ఒప్పంద తరగతులు నిర్వహిస్తారు. కనీసం 200 తరగతులకు హాజరైన వారిని మాత్రమే మార్చి, ఏప్రిల్ నిర్వహించే పరీక్షలకు అనుమతిస్తారు.

ఇవీ.. సబ్జెక్టులు

పదో తరగతికి గ్రూపు ఏలో ఇంగ్లీషుతో పాటు తెలుగు, హిందీ, తమిళం, ఒరియా తీసుకోవచ్చు. గ్రూపు బీలో గణితం, సైన్స్, సోషల్ తీసుకోవాలి. ఇంటర్మీడియట్ గ్రూపు -ఏలో ఇంగ్లీష్‌తో పాటు తెలుగు, హిందీ, తమిళం, ఒరియా తీసుకోవచ్చు. గ్రూప్ బీలో ప్రధాన సబ్జెక్టుల్లో మూడింటితో కలిపి ఐదు సబ్జెక్టులతో ఇంటర్మీడియట్ పూర్తి చేసుకునే అవకాశం ఉంటుంది. స్టడీ మెటీరియల్ సరఫరా చేస్తారు.

ఐదేళ్లలో పూర్తి చేయాలి

అభ్యాసకులు నిర్ణీత ఐదేళ్లలో తొమ్మిది సార్లు పరీక్షలు రాసి ఉత్తీర్ణులవ్వాలి. ఇంటర్మీడియట్ పరీక్షలు రాసేవారు మాత్రం పదో తరగతి ఉత్తీర్ణులై.. రెండేళ్లు ఐదు సబ్జెక్టులు ఒకేసారి రాసుకునే అవకాశం ఉంటుంది. రెండేళ్ల వ్యవధి లేకపోతే నాలుగు సబ్జెక్టులు రాసి, రెండేళ్లు పూర్తయిన తర్వాత మిగిలిన ఒక సబ్జెక్ట్ రాసుకోవచ్చు. అడ్మిషన్ పొందిన అనంతరం ఐదేళ్లలో తొమ్మిది సార్లు పరీక్షలు రాసి ఉత్తీర్ణత పొంద లేకపోతే తిరిగి కొత్త అడ్మిషన్ పొందాల్సి ఉంటుంది.

మార్కుల బదలాయింపు

పదో తరగతి, ఇంటర్మీడియట్ చదివి ఉత్తీర్ణులు కాలేకపోతున్న వారు కూడా సార్వత్రిక పాఠశాలల్లో చేరి సులభంగా ఉండే సబ్జెక్టులు ఎంపిక చేసుకొని ఉత్తీర్ణులయ్యే అయ్యే అవకాశం ఉంటుంది. రెగ్యులర్ టెన్త్, ఇంటర్మీడియట్ ఫెయిల్ అయినప్పటి నుంచి ఐదేళ్లలోపు సార్వత్రిక పాఠశాలల్లో చేరితే రెగ్యులర్ పాస్ అయిన సబ్జెక్టు నుంచి ఏవైనా రెండు సబ్జెక్టులు మార్కులను బదలాయించుకునే వీలుంటుంది. పదో తరగతిలో హిందీ మార్కులను మాత్రం బదలాయించరు. ఇలా బదలాయించుకున్న వారు మిగిలిన మూడు సబ్జెక్టుల పరీక్షలు రాస్తే సరిపోతుంది. ఇంటర్మీడియట్‌కు రూ.150 చొప్పున అడ్మిషన్ సమయంలో అదనంగా చెల్లించాలి.

అర్హతలు ఇవీ..

- పదో తరగతిలో చేరేందుకు వచ్చే ఆగస్టు 31వ తేదీ నాటికి 14 సంవత్సరాల వయస్సు నిండి ఉండాలి. ఎలాంటి గరిష్ట వయోపరిమితి ఉండదు.
- చదవడం, రాయడం తెలిసి ఉండాలి.
- పదో తరగతికి దరఖాస్తుతో పాటు టీసీ, రికార్డ్ షీట్, పుట్టిన తేదీ, ధ్రువీకరణ పత్రం, ఇంటర్మీడియట్‌కు పదవ తరగతి మార్కులు జాబితా టీసీని దరఖాస్తుతో పాటు అందజేయాలి.
- ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు కుల ధ్రువీకరణ పత్రం, దివ్యాంగులు సంబంధిత ధ్రువీకరణ పత్రాన్ని అందజేయాలి.

దరఖాస్తు చేసుకోవాలి



సార్వత్రిక విద్యకు గడువులోగా దరఖాస్తు చేసుకోవాలి. మధ్యలో చదువు మానేసిన వారికి తిరిగి కొనసాగించేందుకు ఇది మంచి అవకాశం. ఏపీ ఓపెన్ స్కూల్ ద్వారా ప్రవేశాలు పొందినవారు, కాంట్రాక్ట్ క్లాసులకు తప్పనిసరిగా హాజరు కావాలి. అర్హత, ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవచ్చు. ఓపెన్ స్కూల్, ఇంటర్మీడియట్ అడ్మిషన్లు ఏటా పెరుగుతున్నాయి.

– పీవీజే రామారావు, జిల్లా విద్యాశాఖ అధికారి, బాపట్ల

కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న డివిజన్ అధ్యక్షుడు సందీప్

బాపట్ల: విద్యుత్ శాఖలో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న కార్మికులను రెగ్యులర్ చేయాలని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ ట్రేడ్ యూనియన్స్ స్ట్రగుల్ కమిటీ బాపట్ల డివిజన్ అధ్యక్షుడు పి.సందీప్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక యూనియన్ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికులను రెగ్యులర్ చేయాలని, 45శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్సీ కేటాయించాలని, జేఎల్ఎం గ్రేడ్-2 ఎనర్జీ అసిస్టెంట్లకు ప్రొబేషన్ పిరియడ్ డిక్లేర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు వినోద్, సిరాజ్, ప్రతాప్‌రెడ్డి, ఆంజనేయులు, లక్ష్మణ్, ప్రదీప్, సుభాని, సురేష్, నాగరాజు పాల్గొన్నారు.

గుండె వైద్య శిబిరానికి అనూహ్య స్పందన



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టరు పర్వతనేని హారిత

బాపట్ల: బాపట్లలోని శ్రీరామచంద్ర మిషన్ హార్ట్‌ఫుల్ మెడిటేషన్ సెంటర్, గుంటూరు రమేష్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత గుండె వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. స్థానిక వివేకానంద కాలనీలో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరంలో పలువురు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. రమేష్ హాస్పిటల్ చీఫ్ కో–ఆర్డినేటర్ డాక్టరు పర్వతనేని హరిత ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించారు. 100 మందికి బీపీ, షుగర్, ఈసీజీ పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో హార్ట్‌ఫుల్ నెస్ ప్రధాన బోధకురాలు మానం మల్లీశ్వరి, లక్కంరాజు విజయలక్ష్మి, లావు రజనీప్రియ పాల్గొన్నారు.

కఠిన చట్టాలను రూపొందించాలి

రేపల్లె: మణిపూర్‌లో మహిళలపై జరుగుతున్న అరాచకాలను కేంద్ర ప్రభుత్వం అరికట్టాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ సమాఖ్య నాయకులు దర్శి భాస్కరరావు డిమాండ్ చేశారు. ఆదివారం సాయంత్రం సమాఖ్య ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. మణిపూర్‌లో మహిళలపై జరుగుతున్న దాడులు మానవాళి తలదించుకునేలా ఉన్నాయన్నారు. దాడులకు పాల్పడుతున్న వారిని కఠినంగా శిక్షించి, భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా కఠిన చట్టాలు తేవాలని డిమాండ్ చేశారు. అనంతరం కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య నాయకులు దారం సాంబశివరావు, చందు, అమర్నాథ్ పాల్గొన్నారు.

మణిపూర్ హింసాకాండపై ప్రభుత్వాలు స్పందించాలి

భట్టిప్రోలు: మణిపూర్ హింసాకాండపై ప్రభుత్వాలు స్పందించాలని జై భీమ్ భారత్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, న్యాయవాది దోవా రమేష్ రామ్‌జీ కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మణిపూర్‌లో మైనార్టీ వర్గాల పై దాడులు చేయడమే కాక, అత్యాచారాలు, హత్యాకాండలకు పాల్పడుతున్నారని ఆయన విచారం వ్యక్తం చేశారు. ఈ దుశ్చర్యలను దేశ వ్యాప్తంగా ఉన్న అన్ని రాజకీయ పార్టీలు ముక్తకంఠంతో ఖండిస్తున్న విషయాన్ని రాష్ట్రంలోని ప్రధాన రాజకీయ పార్టీలు గ్రహించాలని కోరారు.



పరిపాలన అర్హత కోల్పోయిన మోదీ సర్కారు



సమావేశంలో మాట్లాడుతున్న జల్లి విల్సన్

బాపట్ల: ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ పరిపాలన అర్హత కోల్పోయారని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ విమర్శించారు. బాపట్లలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ఆదివారం పార్టీ విస్తృత కౌన్సిల్ సమావేశం చీరాల నియోజకవర్గ కార్యదర్శి చిరమల ప్రకాష్ బాబు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జల్లి విల్సన్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ ప్రజా వ్యతిరేఖ విధానాలకు పాల్పడుతూ, దేశంలో అల్లకల్లోలం సృషించే విధంగా మత విద్వేషాలను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. మణిపూర్ ఘటనలపై మోదీ మౌనం వహించటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశాన్ని రక్షించుకుందాం... రాష్ట్రాన్ని కాపాడుకుందాం అనే నినాదంతో.. ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేఖ విధానాలకు నిరసనగా సీపీఐ చేపట్టిన బస్సుయాత్ర బాపట్ల జిల్లాలో ఆగష్టులో ప్రవేశించనుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ తెలిపారు. ఆగష్టు 26న రేపల్లె నియోజకవర్గంలో జరగనున్న రోడ్‌షోలో చీరాల, బాపట్ల, రేపల్లె , వేమూరు నియోకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకుల సన్నమూరి శ్రీనివాసరావు, మామిడిబత్తు అశోక్, సీపీఐ సీనియర్ నాయకులు ముత్తిరెడ్డి నాగేశ్వరరావు, జె.రత్నకుమారి ఉన్నారు.

ముగిసిన అంకమ్మతల్లి కొలుపులు

పాల్గొన్న బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

పిట్టలవానిపాలెం: మండలంలోని పిట్టువారిపాలెం గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ అంకమ్మతల్లి కొలుపులు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ యేట్ర అశ్విని మాట్లాడుతూ పదిరోజులుగా అమ్మవారి కొలుపులు గ్రామంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. చివరి రోజు అమ్మవారికి చద్ది నైవేద్యాలు, గారెలు, పిండి వంటలు సమర్పించి, మొక్కుబడులు తీర్చుకోవడం జరిగిందన్నారు. బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి అమ్మవారి దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాపట్ల ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచ్‌లు విష్ణుశ్వరరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, గాంధీరెడ్డి, గ్రామపెద్దలు ఉన్నారు.

విశ్వరూపం మహాసభకు తరలిరావాలి

భట్టిప్రోలు: ఆగస్టు రెండవ వారంలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న విశ్వరూపం మహా సభకు వేమూరు నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో మాదిగ సోదరులు తరలిరావాలని ఉమ్మడి గుంటూరు జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వర్ల దేవదాసు కోరారు. ఆదివారం మండలంలోని పెదలంక పంచాయతీ పరిధి మధ్యగూడెంలో ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. గ్రామ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి గ్రామంలో క్యాంప్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆగస్టు 4న కొల్లూరులో డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ కమిటీ హాలులో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఈఎఫ్, మహిళా, వివిధ విభాగాల కార్యకర్తల సమావేశానికి జాతీయ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మున్నంగి నాగరాజు విచ్చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేమూరు నియోజవర్గ ఇన్‌చార్జ్ యలమాటి దాసు, జంపని అశోక్, త్రాపనాని, అత్తోట ఇసాకు, ఎంఈఎఫ్ నాయకులు నన్నెపాముల మనోజ్, గొరికపూడి కిరణ్, కారుమూరు శ్రీనివాసరావు, చిలుమూరు భాస్కరరావు, కారుమూరు బాబురావు, మాజీ సర్పంచ్ నన్నెపాముల నాగేశ్వరావు, ఆలూరి నాని పాల్గొన్నారు.

పాముకాటుతో మహిళ మృతి

కర్లపాలెం: పాముకాటుతో ఓ మహిళ మృతి చెందిన ఘటన పెదపులుగువారిపాలెం పంచాయతీ చిలకల కాలనీలో చోటుచేసుకుంది. కర్లపాలెం ఏఎస్ఐ సాంబశివరావు వివరాల మేరకు.. నంగు రుక్మిణమ్మ(64) ఈ నెల 28న గడ్డివామి నుంచి గడ్డి తీస్తుండగా పాము కాటుకు గురైంది. దీంతో ఆమెను గుంటూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ.. రుక్మిణమ్మ ఆదివారం ఉదయం మృతి చెందినట్లు ఏఎస్ఐ తెలిపారు. ఆమె కుమారుడు నాగిరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు. మృతదేహాన్ని జీజీహెచ్‌లో పోస్టుమార్టం నిర్వహించి, కుటుంబ సభ్యులకు అప్పగించామని వివరించారు.

ఆకుకూరల సాగు..లాభాల బాగు



మరుప్రోలువారిపాలెంలో సాగుచేస్తున్న గోంగూర



మహాత్మాజీపురంలో సాగుచేస్తున్న పాలకూర, చుక్కకూర

- రైతులను ఆదుకుంటున్న ఆకుకూరలు సాగు
- ఆర్థిక చేయూతనిస్తున్న పంటలు

బాపట్ల: ఆకు కూరలకు కేరాఫ్ అడ్రసుగా బాపట్ల నియోజకవర్గాన్ని చెప్పవచ్చు. ఈ ప్రాంతంలోని గరువులో సాగు చేసిన ఆకు కూరలకు మంచి డిమాండ్ ఉంటుంది. అంతేకాకుండా రసాయనిక ఎరువులతో పనిలేకుండా సేంద్రియ ఎరువులతోనే ఎక్కువ ఆకు కూరలను పండించటం ఈ ప్రాంతం ప్రత్యేకత. రైతులకు కూడా ఈ ఆకుకూరల సాగు లాభాలను తెచ్చిపెడుతోంది. బాపట్ల ప్రాంతంలో సాగు చేసిన ఆకు కూరలు జిల్లాలోని నలుమూలలకు, గుంటూరు, ప్రకాశం, కృష్ణా జిల్లాలతోపాటు హైదరాబాద్ ప్రాంతానికి కూడా ఎగుమతులు చేస్తుంటారు. మండలంలోని దరివాదకొత్తపాలెం, వెదుళ్లపల్లి, బేతపూడి, అసోదివారిపాలెం, పోతురాజుకొత్తపాలెం, బసివిరెడ్డిపాలెం, మరుప్రోలువారిపాలెం, మహాత్మాజీపురం, నాగేంద్రపురం, కొత్త కంకటపాలెం గ్రామాల్లో ఇసుక నేలలు అధికంగా ఉండటంతో ఆయా ప్రాంతాల్లోని రైతులు ప్రతి ఏడాది వ్యవసాయం, పశుపోషణతో పాటు ఆకు కూరలు సాగుచేస్తుంటారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఆకు కూరలతో పాటు పూలదండల మధ్యలో పూలకు బదులుగా ఉపయోగించే లైనాకు, మరువానికి కూడా డిమాండ్ ఎక్కువగా ఉండటంతో వాటిని కూడా పెంచే పనిలో రైతులు నిమగ్నమయ్యారు.

విత్తనాలు కేరాఫ్ వెదుళ్లపల్లి..

మండలంలోని వెదుళ్లపల్లి గ్రామంలో ఆకుకూరలు, కాయకూరలు, పూలమొక్కలకు సంబంధించిన అన్ని రకాల విత్తనాలు ఎల్లప్పుడు అందుబాటులో ఉండటంతో ఆయా ప్రాంతాల్లోని రైతులు వెదుళ్లపల్లిలోని విత్తనాలు, మొక్కలను తీసుకొని ఆకుకూరలు, కాయకూరలు, పూలమొక్కల సాగు చేపడుతున్నారు. సాగు చేసిన తర్వాత వాటి పూలు, లైనాకు, మరువంను వెదుళ్లపల్లి మార్కెట్‌కు తరలిస్తారు. అక్కడి నుంచి విజయవాడ, హైదరాబాద్, విజయనగరం, గుంటూరుకు ఎగుమతి చేస్తుంటారు. ఆకుకూరలను ఏ రోజుకారోజు ఉదయం తీసుకువచ్చి, బాపట్ల మార్కెట్‌లో విక్రయిస్తుంటారు. వ్యవసాయంతోపాటు ఆకుకూరల సాగులోనూ బాపట్ల ప్రాంతం జిల్లాలోనే గుర్తింపు పొందింది.

సూపర్ కిడ్ అవార్డు అందుకున్న యశ్వన్‌రాయ్



భట్టిప్రోలు: లిటిల్ ఛాంప్స్ అకాడమి ఆఫ్ ఇండియా, లోటస్ కల్చరల్ ఆర్గనైజేషన్ (హైదరాబాద్) ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన జాతీయ పురస్కార వేడుకల్లో సూపర్ కిడ్ అవార్డ్‌ను మండలంలోని పల్లెకోనకు చెందిన గ్రేస్ ఫౌండేషన్ నిర్వాహకులు కైతేపల్లి షాలేమ్‌రాజు–జ్యోత్స్న దంపతుల కుమారుడు యశ్వన్‌రాయ్ అందుకున్నాడు. వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న వారికి తెలంగాణ పరిషత్ వేదికగా అవార్డుల ప్రదానోత్సవంలో 40 మంది చిన్నారులకు పురస్కారాలు అందజేసారు. సూపర్ కిడ్-2023 అవార్డును కై తేపల్లి యశ్వన్‌రాయ్ అందుకున్నారు. నిర్వాహకులు బుచ్చేశ్వరావు–వసుంధర మాట్లాడుతూ చిన్నారుల్లో ఉండే ప్రతిభను వెలికి తీసేందుకు లిటిల్ ఛాంప్స్ అకాడమి కృషి చేస్తుందని తెలిపారు.

